క్లుప్తంగా

వానదేవుడా కరుణించూ..



కప్పకావడి ఆడుతున్న మహిళలు

చేవెళ్ల: వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, కప్పతల్లి ఆటలు నిర్వహించారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఆదివారం మహిళలు గ్రామ దేవతలకు పూజలు చేసి, కప్పకావడి ఆటలు ఆడారు. కప్పను రోకలికి కట్టి పసుపు, కుంకుమలతో అలంకరించి ఇంటింటికీ తిరుగుతూ వర్షాలు కురవాలి.. వానదేవుడా కరుణించూ అంటూ పాటలు పాడుకుంటూ పూజలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి ఒక నీళ్ల బిందెతో ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నేతలు



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రధాని మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అరోమా రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని పార్టీ అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో తెరపై ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్‌కుమార్, నాయకులు మొగిలి నర్సింలు, మల్లెల ఆనంద్, అంబటి శివశంకర్, పిల్లి సురేష్‌బాబు, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలలను అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు హసన్ ఆదివారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలకు సొంత భవనాలు, ఉపాధ్యాయులు లేరని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉర్దూ మీడియం పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

పాలకవర్గాలను నియమించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయం, శివాలయాలకు పాలకవర్గాలను నియమించి, అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు వెంకట్‌రెడ్డి, మెకానిక్ బాబా, రవీందర్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు.

బీసీలు ఐక్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

మంచాల: బీసీలంతా ఐక్యతగా ఉండాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గడ్డం నర్సింహా గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు ఐక్యతగా లేక పోవడం వలనే రాజ్యాధికారానికి దూరమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి, రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రకారం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారోజు రాజు, మండల నాయకులు ఓరిగంటి శ్రీనివాస్, ఆశయ్య, బాలరాజ్, యాదయ్య, సురేష్, మహేందర్, జంగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్ గ్రామానికి చెందిన జంగిలి జంగయ్య(70) ఇటీవల గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చినుకు రాలదు.. చింత తీరదు

- ముఖం చాటేసిన వరుణుడు
- మొలక దశలోనే ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు



తిమ్మారెడ్డిగూడలో ఎండుముఖం పట్టిన పత్తి మొలకలు



షాబాద్: రోహిని కార్తెలో కురిసిన వర్షాలకు మండలంలోని తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామంలో కొంతమంది రైతులు పత్తి విత్తనాలు వేశారు. నల్లరేగడి భూములు కావడంతో మొలకలు వచ్చాయి. కానీ, సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఆ మొలకలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే పెట్టుబడి తడిసి మోపెడయ్యింది. ఇంకా వర్షాలు పడకపోతే అప్పుల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటి ఆశలతో వానాకాలం సీజన్ సాగును ప్రారంభించిన అన్నదాతలకు నిరాశే ఎదురైంది. తొలకరి వర్షంతో వివిధ రకాల విత్తనాలు వేసిన రైతులు వరుణుడి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ మండలాల్లో ఇటీవల కురిసిన చిరు జల్లులకు రైతులు విత్తనాలు విత్తుకున్నారు. అయితే విత్తనాలు విత్తుకున్నప్పటి నుంచి ఒక్క వాన కూడా సరిగా పడకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తలేదు. అక్కడక్కడా మొలకెత్తినవి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. వర్షాల కోసం అన్నదాతలు ఆకాశంవైపు చూస్తున్నారు.

రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టాను



గత నెల చివరలో నాకున్న 8 ఎకరాల్లో పత్తి వేశా, మొదట నాటిన 5 ఎకరాల్లో పత్తి గింజలు మొలిచాయి. అయితే అవి వర్షాలు లేక ఎండిపోతున్నాయి. మిగిలిన 2 ఎకరాల్లో గింజలు పూర్తిగా మొలకెత్తలేదు. దీంతో రెండోసారి మళ్లీ విత్తనాలు పెట్టించాను. వర్షాలు పడకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వర్షం గట్టిగా పడకపోవడంతో గింజలు ఉబ్బిపోయి పాడైపోయే పరిస్థితి వచ్చింది.

–ముద్దెంగూడ శేఖర్, రైతు, తిమ్మారెడ్డిగూడ

నష్టపోయే పరిస్థితి



తొలకరి వానలు పడగానే రెండెకరాల్లో పత్తిగింజలు పెట్టా. ఒక్కోదానికి రూ.900 చొప్పున ఆరు ప్యాకెట్లు తీసుకొచ్చాం. దుక్కిదున్ని, కూలీలకు డబ్బులు ఇచ్చి మొత్తంగా రూ.25వేలు వెచ్చించా. విత్తనాలు నాటినప్పటి నుంచి ఇప్పటివరకు వాన పడకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. పెట్టుబడి నష్టపోయే పరిస్థితి వచ్చింది.

–గుత్తి రాములు, రైతు, తిమ్మారెడ్డిగూడ

ప్రమాదకరంగా మలుపు



సూచికబోర్డు లేని మలుపు

కొత్తూరు: ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై ఉన్న మూల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారు. అయినప్పటికీ అధికారులు మండలంలో ప్రమాదకరంగా మారిన మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలకు గురవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రూలింగ్ పార్టీకి కొమ్ముకాస్తున్న తహసీల్దార్

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: ఒక పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ.. ఇతర పార్టీ వారిపై తమ అధికారాన్ని ప్రయోగిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ రత్నం ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టానికి లోబడి ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ సమానంగా అందేలా చూడాల్సిన అధికారి, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పనిచేస్తున్నాడన్నారు. హైతాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన కొందరు తమకు అసైన్ చేసిన భూమిలో గత పది ఇరవై సంవత్సరాల నుంచి ఇండ్లు, షెడ్లు నిర్మించుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. వారు అక్రమ కట్టడాలు కట్టుకున్నారంటూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారివి కూల్చివేయడం, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారివి వదిలివేయడంతోనే తహసీల్దార్ అనుసరిస్తున్న పక్షపాత ధోరణి అర్థమవుతుందన్నారు. కంపెనీలకు మట్టిని అమ్ముకుంటున్న మాఫీయాకు కొమ్ముకాస్తూ పెద్దవేడు, సోలీపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుల్ల చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలను ఇబ్బందులకు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హైతాబాద్ అక్రమ కూల్చివేతలపై అక్రమంగా మట్టి తరలింపులపై ఉన్నతస్థాయి విచారణకు పోతామన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు వైభవ్‌రెడ్డి, రాఘవేందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటేలా సమష్టిగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు వారు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులందరికీ రేషన్‌కార్డులు వస్తాయని, ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, శేఖర్, రవి, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, రామస్వామి, సత్తయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నేడు కేజీరెడ్డి కళాశాలలో 'కేజీఆర్ ఇడియాథాన్'

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం 'సామాజిక ప్రభావం' అనే అంశంపై 'కేజీఆర్ ఇడియాథాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ఏఓ రవికిరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సమాజ, సామాజిక సమస్యలపై ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రదర్శిస్తూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మినారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

మైసమ్మ సన్నిధిలో మాజీ ఎంపీ



అమ్మవారిని దర్శించుకున్న మధుయాష్కిగౌడ్

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆదివారం కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మధుయాష్కిని పూలమాల శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, నాయకులు దుర్గారెడ్డి, అర్చక సిబ్బంది చంద్రయ్య, కృష్ణయ్య, యాదగిరి, బాలబ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

యాచారం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామాల్లో ఏడాది క్రితం రెండు వేలకు పైగా భూ సమస్యలున్నాయని, నేటికీ అవి అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారే కానీ.. అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రస్తుత సదస్సులో అందిన అర్జీలకు పరిష్కారం మార్గం చూపాలని కోరారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి



గ్రామస్తులకు విరాళం అందిస్తున్న వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: మహనీయులు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆయన ఆదివారం గ్రామస్తులకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే మహనీయుల విగ్రహాలు ప్రజల్లో వారి ఆశయాలను గుర్తు చేస్తాయన్నారు. ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంతోనే మన దేశంలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. అలాంటి మహనీయుల విగ్రహాలు ప్రతి గ్రామంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



షాద్‌నగర్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పట్టణంలోని పద్మావతీకాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2011–12 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమీపంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటాపాటలతో రోజంతా సరదాగా గడిపారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు మాధవీలత, అర్జునప్ప, మన్నన్, పుష్పలతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంట్లవెల్లి సుమన్, సురేష్, హరి, పవన్, లింగం, మనోహర్, శ్రీను, స్వప్న, సరిత, ప్రవళిక, జ్యోతి, మమత, సాయి, శ్రీను, వినోద్, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కనకమామిడి పాఠశాలలో..

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు చాకలిగూడలోని ఓ ఫాంహౌస్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. నాటి ఆటాపాటలు, అల్లరి చిల్లరి చేష్టలు, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మొయినాబాద్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరామర్శ



గోప్యనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు

కేశంపేట: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని పోడగుట్టతండాలో రాంబాల్‌నాయక్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గోప్య నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం రాంబాల్‌నాయక్‌తో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎల్గనమోని రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి 'ఐక్యత' సాయం



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ఎర్రబిక్యతండాలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమ కోసం ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సుంకిరెడ్డిని గిరిజనులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు హనుమాన్ దేవాలయం పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు బొబ్బొలి, రాజశేఖర్, కృష్ణ, బిచ్యానాయక్, మోత్యానాయక్, సక్రు, హనుమంతు, నంగ్రియ, గాంగ్య, హర్య, రాములు, శ్రీను, రమేశ్, బాస్కర్, వినోద్, సికిందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కడ్తాల్: దేవాలయాల నిర్మాణంతో భక్తి భావం పెంపొందుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం కానుగుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవానీ ఆలయానికి ఆదివారం ఆయన రూ.1 లక్ష విరాళం అందజేశారు. దేవాలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సుంకిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉపసర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, నర్సింగ్ నాయక్, దేవులానాయక్, ఫౌండేషన్ సభ్యులు రఘు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనివి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ మలిదశ పోరాటంలో ఉద్యమకారుడు, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ మౌర్య కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. సాయి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయిచంద్ తన ఆట పాటలతో ఉద్యమాన్ని ఉధృతలూగించారని తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందపెద్ద నర్సింహ, నాయకులు జోగు వీరయ్య, తులసీరాం, లచ్చిరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

- అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతున్న విద్యుత్
- ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని వినతి



నదీమ్‌నగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల గేటు వద్ద వెలుగుతున్న వీధి దీపం



హిమాయత్‌నగర్‌లో ..

మొయినాబాద్‌రూరల్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలం, మున్సిపల్‌లోని చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. మండల పరిధిలోని నదీమ్‌నగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల ఎదురుగా, అజీజ్‌నగర్ గ్రామంలో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు వెలుగుతూనే ఉన్నాయి. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో కూడా కూడా ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.